# పులి దడ

## టైగర్స్‌కు సురక్షిత ప్రాంతాలుగా జిల్లా అడవులు

- పక్క రాష్ట్రాల నుంచి పెరిగిన రాకపోకలు
- యేటా ఇదే సీజన్‌లో దాడులు
- మూడేళ్లలో ముగ్గురిపై పంజా..
- 70కిపైగా మూగజీవాల మృత్యువాత
- పత్తి తీసే సమయాల్లోనే ఎక్కువ ఘటనలు
- అటవీ గ్రామాల్లో అధికారుల అవగాహన
- అప్రమత్తంగా ఉండాలని సూచన

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/పెంచికల్‌పేట్, డిసెంబర్ 12 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అడవులు పులుల ఆవాసానికి అనువైన ప్రాంతంగా మారింది. తడోబా, తిప్పేశ్వర్ నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రాణహిత సరిహద్దులు దాటుకొని యేటా ఈ సీజన్‌లో మాహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని పులుల అభయారణ్యాల నుంచి ఆసిఫాబాద్ జిల్లాతో పాటు ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతాల్లోకి రాకపోకలు సాగిస్తుంటాయి. కాగజ్‌నగర్ టైగర్ కారిడార్ ఇంద్రావతి, తడోబాతో పాటు ఇటు కవ్వాల్ అభయారణ్యాలకు కూడలిగా ఉండడంతో ఈ ప్రాంతాల్లో పులులకు స్థావరంగా ఉంటోంది. సాధారణంగా నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో పులులు సంగమించే సమయం. జత కోసం, ఆహారం కోసం మహారాష్ట్రలోని అభయారణ్యాల నుంచి ప్రాణహిత సరిహద్దుల గుండా వస్తున్నాయి. దాదాపు మూడేళ్లుగా ఇదే సీజన్‌లో పులుల దాడులు జరిగాయి. చేలల్లో పనులు చేసుకుంటున్న కూలీలు, రైతులతో పాటు మేతకు వెళ్లిన పశువులపైనా పంజా విసిరాయి. అదృష్టవశాత్తు ఈ ఏడాది ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేదు. ఈ నేపథ్యంలో అటవీ సమీప గ్రామాలకు ప్రమాదం పొంచి ఉండగా, అప్రమత్తంగా ఉండాలంటూ అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆదివాసులంతా అడవులపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ముఖ్యంగా కోయ, మన్నేవార్, తోటి, గోండ్ గిరిజనుల జీవనం పూర్తి అడవులతోనే ముడిపడి ఉంటుంది. తరతరాలుగా వారి వ్యవసాయం అడవుల్లోనే సాగుతుంది. నివాస గ్రామాలు అడవులనే ఆనుకొని ఉంటాయి. ఉదయం లేచింది మొదలు.. రాత్రి వరకూ అడవిలోనే పనులు చేసుకుంటుంటారు. పదేళ్లు నిండని పిల్లలను కూడా తల్లిండ్రులు తమ వెంట చేలకు తీసుకెళ్తుంటారు. ముఖ్యంగా పత్తి తీసే సమయాల్లో అటవీ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

### మూడేళ్లలో ఘటనలు..

జిల్లాలో 2020, నవంబర్‌లో దహెగాం మండలం దిగిడ గ్రామానికి చెందిన సిడాం విగ్నేష్‌పై పులి దాడి చేసి చంపింది. విగ్నేష్ చేపల వేటకు వెళ్లిన సమయంలో ఇది జరిగింది. ఈ ఘటన మరువక ముందే.. ఇదే నెలలో పెంచికల్‌పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన పసుల నిర్మల (15)ను పులి చంపింది. గ్రామానికి సమీపంలోని చేనులో పత్తి ఏరుతుండగా పెద్ద పులి దాడిచేసి నోట కరుచుకపోయింది. గతేడాది వాంకిడి మండలం చౌపన్‌గూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన సిడాం భీము అనే రైతు పత్తి ఏరేందుకు వెళ్లగా.. పులి దాడి చేసి చంపింది. అలాగే దాదాపు 120 పశువులపై దాడులు చేయగా, ఇందులో సుమారు 70 మూగజీవాలు ప్రాణాలు కోల్పోయాయి. యేటా నవంబర్, డిసెంబర్, జనవరి నెలల్లోనే ఈ ఘటనలు జరగడం కలకలం రేపుతున్నాయి.

### అటవీ గ్రామాల్లో అవగాహన

తెలంగాణ రాష్ట్రంలోని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ అటవీడివిజన్ పరిధిలోని పెంచికల్‌పేట్ రేంజ్ పులుల ఆవాసము, సంరక్షణ, సంతతి అభివృద్ధికి పేరుగాంచిన ప్రాంతం. ఈ రేంజ్‌లో దట్టమైన అడవులు ఉండడం.. ప్రాణహితనది, పెద్దవాగు, గుహలు ఉండడంతో ఈ ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నాయి. ప్రధానంగా పంటలు చేతికి వచ్చే దశలో అవి ఎక్కువగా పంట చేలల్లో నివాసం ఏర్పాటు చేసుకుంటాయి. మేతకోసం వచ్చే పందులను వేటాడి తింటాయి. ఇదే సమయంలో చేలకు వచ్చే రైతులు, కూలీలపై దాడి చేస్తుంటాయి. పశువులపైనా పంజా విసురుతాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గిరిజన గ్రామాలైన ఎర్రగుంట, కొండపల్లి, లోడ్పల్లి, జైహింద్‌పూర్, మేరగూడ,అగర్‌గూడ , గుండేపల్లి, కమ్మర్‌గాం, నందిగాం, జిల్లెడ, మొర్లిగూడలలో గ్రామస్తులకు అటవీ అధికారులు ప్రత్యేక అవగాహన కల్పిస్తూ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్నారు.

### జాగ్రత్తలివే..

- ఉదయం వేకువజామున చేలకు వెళ్లవద్దు. సూర్యోదయం తర్వాతే వెళ్లాలి.
- ఒక్కరు కాకుండా గుంపులు గుంపులుగా శబ్ధాలు చేస్తూ కదలాలి.
- రాత్రి పూట చేలకు కాపలాగా వెళ్లే వారు కాగడాలవంటివి పట్టుకొని గుంపుగా వెళ్లాలి.
- శబ్ధాల కోసం డప్పులు, ఎలక్ట్రికల్ మైకులను వాడాలి.
- అడవిపందుల బెడద నుంచి పంట కాపాడుకునేందుకు లో ఓల్టేజ్ సోలార్ షార్ట్ వాడాలి.
- ఒంటరిగా పత్తి ఏరవద్దు.. నలుగురైదుగురు కలిసి ఒకే దగ్గర పత్తి తీయాలి.
- నీళ్లు తెచ్చుకునేందుకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి.

### అప్రమత్తంగా ఉండాలి

అటవీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గుంపులు గుంపులుగా శబ్ధాలు చేస్తూ చేలకు వెళ్లాలి. అలాంటప్పుడే పులుల నుంచి మనకు హానీ ఉండదు. పులులు సంచరించే ప్రాంతంలో పెగ్ మార్కులుగాని, అలజడిగాని ఉంటే అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలి. సాహసోపేత నిర్ణయాలు తీసుకోవద్దు.



**- వేణుగోపాల్, ఎఫ్ఆర్వో, పెంచికల్ పేట్**

## పులి దాడిలో ఒకరికి గాయాలు

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, డిసెంబర్ 12 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని వంజిరి గ్రామానికి చెందిన అల్లూరి గులాబ్ దాస్ ఊరి పరిసర ప్రాంతాల్లోని అటవీ ప్రాంతంలో పశువులను మేపుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో పెద్దపులి ఒక పశువుపై దాడి చేసింది. ఇది గమనించిన గులాబ్ దాస్ పులిని అతని చేతిలో ఉన్న కర్రతో బాదాడు. దీంతో పులి ఒక్కసారిగా అతనిపై దాడి చేసి పారి పోయింది. కేకలు వేయడంతో ఆ ప్రాంతంలోనే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బంది గమనించారు. చేతికి, నడుంపై గాయాలు కావడంతో పశువుల కాపరిని హుటాహుటిన కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రాణాపాయం ఏమి లేదని అధికారులు తెలిపారు.



ఆదిలాబాద్‌లోని మహాత్మా జ్యోతి బా పూలే విద్యాలయం

# పేద విద్యార్థులకు వరం.. రెసిడెన్షియల్ స్కూల్స్..

## ఇంటర్ విద్యతో ఉన్నత చదువులకు అవకాశం

ఆదిలాబాద్, డిసెంబర్ 12(నమస్తే తెలంగాణ) ః ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆదిలాబాద్ జిల్లాలో విద్యారంగం అస్తవ్యస్తంగా ఉండేది. ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో సరైన వసతుల లేక విద్యార్థులు చదువులు ముందుకు సాగేవి కావు. పేద విద్యార్థులకు చదువుకోవాలనే ఆసక్తి ఉన్న సౌకర్యాలు సరిగా లేక వారి విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. దీంతో ప్రతిభ గల విద్యార్థులు మధ్యలోనే చదువులు మానేయాల్సిన పరిస్థితి ఉండేది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందించింది. అన్ని వర్గాలకు చెందిన పిల్లలు ఉచితంగా విద్యను అభ్యసించేలా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసి కార్పొరేట్ చదువులను అందిస్తున్నది. విద్యార్థులు చదువులు మధ్యలో ఆగిపోకుండా రెసిడెన్షియల్ స్కూళ్లలో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టింది. ఆదిలాబాద్ జిల్లాలో ఆరు బీసీ రెసిడెన్షియల్ జ్యోతిబా పూలే విద్యాలయాలు పేద విద్యార్థులకు వరంగా మారాయి. వీటిల్లో 3,320 మంది విద్యార్థులు ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్నారు. ఆదిలాబాద్ బాలికల మహాత్మా జ్యోతిబా పూలే విద్యాలయంలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఉండగా 640 మంది విద్యార్థినులు.. బాలుర స్కూల్, జూనియర్ కళాశాలలో 640 మంది, జైనథ్ బాలుర స్కూల్, కళాశాలలో 640 మంది, తాంసి మండలం ఈదుల సవర్‌గాం స్కూల్, జూనియర్ కళాశాలలో 640 మంది, జైనథ్ మహాత్మా జ్యోతిబా పూలే బాలికల విద్యాలయంలో 540 మంది, ఇచ్చోడ మండలం నర్సాపూర్ స్కూల్, కళాశాలలో 540 మంది, బేల బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌లో 320 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

- బీసీ రెసిడెన్షియళ్లలో 3320 మంది విద్యార్థులు

### ఐదు విద్యాలయాల్లో ఇంటర్ విద్య

ఆదిలాబాద్ జిల్లాలో ఐదు బీసీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఆదిలాబాద్ బాలికలు, జైనథ్‌లో బాలురు, బాలికల మహాత్మ జ్యోతి బాపూలే జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఆదిలాబాద్, జైనథ్ జూనియర్ కళాశాలల్లో మొదటి సంవత్సరంలో 130 మంది, రెండో సంవత్సరంలో 144 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జైనథ్ బాలుర జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 92 మంది, రెండో సంవత్సరంలో 52 మంది విద్యార్థులు ఉన్నారు. బోథ్ నియోజకవర్గంలో తాంసి మండలం ఈదుల సవర్‌గాం, ఇచ్చోడ మండలం నర్సాపూర్‌లో మహాత్మా జ్యోతి బా పూలే జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈదుల సవర్‌గాం జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 52 మంది, రెండో సంవత్సరంలో 67 మంది విద్యను అభ్యసిస్తున్నారు. నర్సాపూర్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో 35 మంది చదువుకుంటున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో విద్యార్థులు చదువుల్లో ప్రతిభ కనపరుస్తూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారు.

# కూరగాయల పంట.. లాభాలు ఇంట..



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన టమాట



బీరకాయ పంట

## సిద్ధులకుంట రైతన్నలకు సిరులు కురిపిస్తున్న సాగు

- ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్న రైతులు
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామ రైతులు
- ఒక్కో పంటకు రూ.2 లక్షల వరకు లాభం

*నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని సిద్ధులకుంట గ్రామానికి చెందిన పలువురు రైతులు సాధారణంగా పసుపు, వరి, మక్క, సోయా, పత్తి సాగు చేస్తారు. వీటితోపాటు టమాట, కొత్తిమీర, బీర, వంకాయ, మిరప వంటి కూరగాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో అధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన గల ముంపు గ్రామమైన సిద్ధులకుంటలో చెరువులు, కుంటలు, ఇతర సాగునీటి వనరులు పెద్దగా లేనప్పటికీ, గత తెలంగాణ సర్కారు నుంచి అందజేస్తున్న నిరంతర కరెంటుతో బోరు బావుల నీటిని ఒడిసిపట్టి సిరులు పండిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమాట కిలో రూ.30 పలుకుతోండగా.. కొత్తిమీర 250 గ్రాములకు రూ.40, వంకాయలు కిలో రూ.80, బీరకాయలు కిలో రూ. 100ల చొప్పన లభిస్తున్నాయి. ఇలా ధరలు మండిపోతున్న క్రమంలో సిద్ధులకుంట రైతులు మాత్రం కూరగాయలు పండిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాకుండా పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.* - నిర్మల్, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ)



సిద్ధులకుంటలో టమాటను తెంపుతున్న రైతులు, కూలీలు

### సీజన్‌కు రూ.2 లక్షలు వస్తాయి..



*నాకు 15 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. యేటా వానకాలంలో ఏడెకరాల్లో పసుపు, ఒక ఎకరంలో వరి, మిగతా భూమిలో మొక్కజొన్న, ఎర్ర జొన్న, ముళ్ల జొన్న వేస్తా. చలికాలంలో కూరగాయల దిగుబడులు అధికంగా ఉంటాయి. కార్తీకమాసం, అయ్యప్ప స్వాములు దీక్షలు ఉండడం వల్ల మంచి డిమాండ్ ఉంది. వీటిని దృష్టిలో పెట్టుకొని యేటా ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో టమాట, మిరప, వంకాయ వేస్తాం. ఈ యేడు ఎకరంలో టమాట వేశా. గత నెల 10న మొదటి దిగుబడి వచ్చింది. రెండు, మూడు రోజులకోసారి 50 క్యారెట్ల దిగుబడి వస్తున్నది. ప్రస్తుతం టమాటకు నిర్మల్ మార్కెట్‌లో మంచి ధర ఉన్నది. 25 కిలోల క్యారెట్ ధర నాణ్యతను బట్టి రూ.300–రూ.450 పలుకుతున్నది. ఇప్పటివరకు రూ.లక్షకు పైగా వచ్చింది. మరో నెల రోజుల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉంది. ఎకరం టమాట సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, దుక్కి, కూలీలకు కలిపి రూ.20వేల వరకు ఖర్చులు అయ్యాయి. ఎప్పుడూ ఒకే రకమైన పంటలు కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్నవి వేస్తే కచ్చితంగా లాభాలు వస్తాయి. ఒక్క టమాట సాగుతోనే ఈ సీజన్‌లో రూ.2 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.* **- నర్సారెడ్డి, టమాట రైతు, సిద్ధులకుంట, సోన్ మండలం**

### తోట వద్దకే వచ్చి కొంటున్నారు..



*నాకు ఆరెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. వానకాలంలో పసుపు, మొక్కజొన్న, సోయా వేస్తా. పసుపు పంట చేతికి రావాలంటే 9 నెలలు పడుతుంది. ఆ తర్వాత 3 నెలల పాటు కూరగాయలు పండిస్తా. ఈ యేడు ఎకరం భూమిలో వంకాయ, బీరకాయ పంటలు వేశా. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. వంకాయలు ప్రస్తుతం ఒక్కో క్యారెట్ (12 కిలోలు) రూ.500 ధర ఉన్నది. రోజుకు 12 క్యారెట్ల వంకాయలు తెంపుతున్నా. రూ.6 వేల వరకు ఆదాయం వస్తున్నది. వ్యాపారులు తమ తోట వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రవాణా ఖర్చులు కూడా మిగులుతున్నాయి. బీర ఇంకా పూత దశలో ఉంది. రోజు ఆహారంగా తీసుకునే కూరగాయలకు అన్ని కాలాల్లోనూ డిమాండ్ ఉంది. రైతులు సంప్రదాయ పంటలతోపాటు ఉన్న దాంట్లో కొంత భూమిని కూరగాయలు, ఆకుకూరల సాగుకు కేటాయించాలి. ఒక పంటలో నష్టం వచ్చినా... మరో పంటలో లాభం వచ్చే అవకాశం ఉంది.* **- నవీన్, రైతు, సిద్ధులకుంట, సోన్ మండలం.**

### నిరంతర కరెంటుతో కొత్తి మీర సాగు..



*ప్రతి వంటకం చివరలో కొత్తి మీర వేయడం మన ఇళ్లల్లో ఒక అలవాటు. యేడాదిలో 365 రోజులు కొత్తిమీరకు డిమాండ్ ఉంటుంది. ప్రతి సీజన్‌లో సాధారణ పంటలతోపాటు కొత్తిమీర, ఇతర కూరగాయల సాగుకు రెండెకరాల వరకు భూమిని కేటాయిస్తా. కేవలం కొత్తిమీర కోసమే దాదాపు ఎకరం కేటాయించి మడులను సిద్ధం చేస్తాం. ఆయా మడుల్లో వారం, పది రోజుల తేడాతో కొత్తిమీర విత్తనాలు వేస్తాం. దీనివల్ల ఒకేసారి కోతకు రాకుండా దఫదఫాలుగా వస్తుంది. ఒక్కో మడి పంటను వారం అమ్ముకునే వెసులుబాటు ఉండడంతో ధరల్లో హెచ్చు తగ్గులైనప్పటికీ నష్టపోయే అవకాశం ఉండదు. నిర్మల్ మార్కెట్‌లో ప్రస్తుతం క్వింటాలుకు రూ.2500–రూ.3వేల ధర ఉన్నది. 45 రోజుల నుంచి రోజుకు క్వింటాలు చొప్పున కొత్తిమీర అమ్మిన. ఇప్పటి వరకు రూ.లక్షకు పైగా ఆదాయం వచ్చింది. మరో 20 రోజుల వరకు అమ్ముకునేందుకు సరిపడా పంట ఉంది. కేవలం బోరు బావులపైనే ఆధారపడి సాగు చేస్తున్నా. నిరంతర కరెంటుతో చలికాలంలోనే కాకుండా మండు వేసవిలోనూ కూరగాయలు పండించి లాభాలు పొందుతున్న. ఒకే రకమైన పంటలు వేసే బదులు.. డిమాండ్ ఉన్న పంటలు వేస్తే లాభాలు వస్తాయి.* **- ఆలూరి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, సిద్ధులకుంట, సోన్ మండలం**



మావల కొండపై కమ్ముకున్న పొగమంచు


# వణికిస్తున్న చలి

*ఆదిలాబాద్ జిల్లాలో మూడు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఉదయం, రాత్రి సమయాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ఇగంతో ప్రజలు వణికిపోతున్నారు. చలి నుంచి ఉపశమనం పొందడానికి స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరిస్తున్నారు. చాయ్ దుకాణాల వద్ద వేడి వేడి టీ తాగుతూ సేద తీరుతున్నారు. గ్రామాల్లో జనం చలిమంటలు వేసుకుంటున్నారు. చలి తీవ్రత పెరిగినందునా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.*

- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



తలమడుగు మండలం దేవాపూర్‌లో చలిమంట కాగుతున్న గ్రామస్తులు



ఆదిలాబాద్ నుంచి తలమడుగు మండలం దేవాపూర్‌కు పొగమంచులో వెళ్తున్న కూరగాయల వ్యాపారి



దేవాపూర్‌లో చలిలో బియ్యం చెరుగుతున్న మహిళ



దేవాపూర్‌లో శనగ పంటపై కమ్ముకున్న పొగమంచు



దేవాపూర్‌లో పత్తి పంటపై కమ్ముకున్న పొగమంచు